సాక్షి
కుమురం భీం
గురువారం । 26 । జనవరి । 2023



ముగిసిన బేతల్ పూజలు

కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు బుధవారం బేతల్ పూజలు నిర్వహించారు. వంశ పెద్దలు వెదురుకర్రతో బేతల్ నృత్యాలు చేశారు. 8లో▸



గణతంత్ర వేడుకల్లో 'గుస్సాడీ'

ఎర్రకోట వేదికగా నిర్వహించే గణతంత్ర వేడుకల్లో 'పద్మశ్రీ' కనకరాజు బృందం గుస్సాడీ ప్రదర్శన ఇవ్వనుంది. 11 మందిని ప్రదర్శన కోసం ఎంపిక చేశారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /17.9

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా మారుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికమవుతుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉదయం ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటలతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, సర్పంచ్ వరలక్ష్మి, నాయకులు భీమేశ్, బాపురావ్, సిరాజ్, దత్తు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంతతి పెంచాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పశువుల సంతతి మరింత పెంచాలని జిల్లా పశువైద్యాధికారి సురేశ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం అప్పపల్లిలో జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి పశువుల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పశువులకు గర్భకోశ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాలు ఈ నెల 31 వరకు కొనసాగుతాయని తెలిపారు. కుక్కలు, పిల్లులు వంటి మూగ జీవాలతో కరుణతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, ఎస్సై గంగన్న, మండల పశువైద్యాధికారి మురళీకృష్ణ, నాగన్న, పురుషోత్తం, సర్పంచ్ బాపురావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు ఓంకార్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న ఓంకార్

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన జునుగరి ఓంకార్ జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ మాస్టర్స్ విద్యనభ్యసిస్తున్న ఓంకార్ ఈ నెల 23న యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన రైఫిల్ పోటీల్లో(పీప్‌సైట్) గోల్డ్‌మెడల్ సాధించాడు. నన్నయ యూనివర్సిటీ తరఫున ఓంకార్ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగే జాతీయ రైఫిల్ పోటీల్లో పాల్గొంటారని తల్లిదండ్రులు జునుగరి రంగయ్య, ప్రమీల తెలిపారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): విశ్వబ్రాహ్మణుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పాంచాలపు లక్ష్మణాచారి అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని కోదండ రామాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని విశ్వ బ్రాహ్మణ కులస్తులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని, వడ్రంగి వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న వారికి ప్రత్యేక టింబర్ డిపోలు కేటాయించాలని, వర్క్‌షాపులు మంజూరు చేయాలని అన్నారు. విశ్వ బ్రాహ్మణ బంధును అమలు చేసి ప్రతీ కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లగొండ సదాశివ్, కొత్తపెల్లి జనార్ధనాచారి, మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మణాచారి, పట్టణ అధ్యక్షుడు యాదగిరి చారి, కార్యదర్శి రవిచారి, కోశాధికారి నర్సింహాచారి, సభ్యులు వెంకటేశం, రామ్మూర్తి, సంతోష్‌కుమార్, నారాయణ, కిషన్, పెంటయ్య పాల్గొన్నారు.

బొమ్మలతో బోధన



లోదుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారులు



రెబ్బెనలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం

- అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు
- ప్రీస్కూల్ కిట్లతో పాఠాలు బోధిస్తున్న టీచర్లు
- 100 ఎల్‌ఈడీ టీవీలు పంపిణీ
- జిల్లాలోని 973 అంగన్‌వాడీ కేంద్రాల్లో 47,216 మంది చిన్నారులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యనందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. గతంలో కేవలం ఆరోగ్య, పౌష్టికాహార కేంద్రాలుగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించి ప్రీస్కూల్ కిట్లతో విద్యార్థులకు అక్షరాలను నేర్పిస్తున్నారు. ప్రాథమిక విద్యకు చిన్నారులను సిద్ధం చేసేలా కేంద్రాలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

జిల్లాలో 973 కేంద్రాలు..

జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 289 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. వీటిలో 47,216 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో 0- 6 నెలల వారు 4655 మంది, 7-12 నెలలు 5772 మంది, ఏడాది నుంచి మూడేళ్ల 16,677 మంది, మూడు నుంచి ఆరేళ్ల వారు 20,186 మంది ఉన్నారు. ఆయా కేంద్రాల్లో చిన్నారులకు ఓ వైపు పౌష్టికాహారం అందించడంతోపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలు కేంద్రాల్లో ఉండేలా ఆటలు, పాటలు, కథలతో పదాలను నేర్పిస్తున్నారు. బొమ్మల ద్వారా సృజనాత్మక విద్యనందిస్తున్నారు.

సుందరంగా కేంద్రాలు

గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శిథిలావస్థకు చేరిన కేంద్రాలకు మరమ్మతులు చేయిస్తూ మోడల్ అంగన్‌వాడీ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు ఉల్లాసంగా ఉండే విధంగా గోడలపై రకరకాల పక్షుల బొమ్మలు, ఇంద్ర ధనస్సు, అక్షరాలు, పదాలు, అంకెలు, ఆడుకోవటానికి ఆటవస్తువులు సమకూర్చారు. గతంలో కంటే కేంద్రాలకు రావటానికి పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు.

కిట్లతో బోధన

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు కిట్లతో చిన్నారులను ప్రాథమిక విద్యకు సిద్ధం చేస్తున్నారు. కేంద్రాల్లో పంపిణీ చేసిన కిట్ల ద్వారా కథలను చెబుతూ బోధనలో వినూత్న పద్ధతులు అనుసరిస్తున్నాం. ఇప్పటికే ఎంపిక చేసిన మోడల్ కేంద్రాల్లో వసతులను కల్పించడంతోపాటు రంగులతో సుందరంగా తీర్చిదిద్దాం. కిట్ల ద్వారా బోధన ప్రారంభమైన తర్వాత కేంద్రాలకు విద్యార్థుల రాక పెరిగింది.

– సావిత్రి, ఐసీడీఎస్ జిల్లా అధికారి

కిట్లతో మేలు

చిన్నారులు ప్రాథమిక విద్యకు సిద్ధం కావడానికి ప్రీస్కూల్ కిట్లు ఎంతో దోహదం చేస్తున్నాయి. పిల్లల్లో బడి అంటే భయం పోగొట్టడానికి ఉపయోగపడుతున్నాయి. మరో వైపు ఎంపిక చేసిన 100 అంగన్‌వాడీ కేంద్రాలకు కిట్లతో పాటు ఎల్‌ఈడీ టీవీలను అందజేశారు. వీటి ద్వారా ఆయా కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాలు, పాటలను బోధిస్తున్నారు. బంతులు విసరడం, ఆడటం, కథల రూపంలో బోధించడంతో చిన్నారులకు ఆసక్తి పెరుగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలు కార్పొరేట్ స్కూళ్లను తలపిస్తున్నాయి.

నిల్వ పత్తితో ప్రమాదాలు!



కౌటాల మండల కేంద్రంలో ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి



ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు కౌటాల మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన దంపతులు చెన్నూరి కైలాస్, రుమా. వానాకాలం సీజన్‌లో సొంత చేను రెండెకరాలతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశారు. మార్కెట్‌లో ధర లేకపోవడంతో మొదటి సారి తీసిన పంటను ఇంట్లోనే నిల్వ ఉంచారు. జనవరి 2న వారి పెద్ద కుమారుడు అభిషేక్(12) తోటి పిల్లలతో దాగుడుమూతలు ఆడుతూ పత్తిలో దాక్కున్నాడు. ఊపిరి ఆడకపోవడంతో మృతి చెందాడు.

- ధర లేక ఇప్పటికీ రైతుల ఇళ్లలోనే పంట
- సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అగ్ని ప్రమాదాలు
- ఇటీవల పత్తిలో ఆడుకుంటూ ఊపిరాడక బాలుడు మృత్యువాత

పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడ గ్రామానికి చెందిన రైతు రాములు వానాకాలం సీజన్‌లో సొంత చేనులోనే పత్తి సాగు చేశాడు. దిగుబడి అనుకున్న రీతిలో వచ్చినా మార్కెట్‌లో ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రాదనే ఉద్దేశంతో పంటను అమ్ముకోలేదు. ఇంట్లోనే నిల్వ చేశాడు. ఇటీవల ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మూడు క్వింటాళ్ల పత్తి మంటలకు కాలిబూడిదైంది.

కౌటాల(సిర్పూర్): అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పత్తిని అమ్ముదామంటే గిట్టుబాటు ధర లేక రైతులు పంటను ఇంటిలోనే నిల్వ చేసుకుంటున్నారు. పెట్టుబడులు అధికమై వర్షాభావ పరిస్థితులతో దిగుబడి తగ్గింది. మార్కెట్ ధర తక్కువగా ఉండడంతో పత్తిని అమ్ముదామా.. ఆగుదామా.. అనే సంశయంలో కొట్టుమిట్టాడుతున్నారు. పల్లెల్లో నిల్వ ఉంచిన పత్తిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అగ్ని ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్‌తో మంటలకు పంట బూడిదవుతుండటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల ఓ బాలుడు పత్తి పంటలో ఊపిరాడక మృతి చెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

మద్దతు ధర కోసం..

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. ధర పెరుగుతుందేమోననే ఆశతో చాలా మంది ఇప్పటికీ పంటను ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్నారు. అయినా ధర పెరగకపోతే ఎన్ని రోజులు నిల్వ ఉంచాలని, అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో వరదలు పత్తి రైతులను ముంచాయి. ముఖ్యంగా సిర్పూర్ నియోజకవర్గంలో రైతులు విత్తనాలు మొలకెత్తకపోవడంతో పత్తి సాగు కోసం రెండుసార్లు పెట్టుబడి పెట్టారు. ఖర్చులు తడిసిమోపడయ్యాయి. క్వింటాల్‌కు రూ.15వేలు చెల్లిస్తేనే గిట్టుబాటవుతుందని వారు పేర్కొంటున్నారు. మొదటి విడతలో ఏరిన పత్తి ఇళ్లలో కుప్పలుగా పేరుకుపోయింది. ప్రస్తుతం రెండోసారి కూలీలతో పత్తి ఏరిపిస్తున్నారు. కనీసం కూలీలకు చెల్లించేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో కొంతమంది వ్యాపారులకు తక్కువ ధరలకే అమ్ముకుంటున్నారు.

అప్రమత్తతే రక్ష..

అనుకున్న రేటు వచ్చినప్పుడే అమ్ముదామని చాలా మంది అన్నదాతలు ఇంట్లోనే పత్తి నిల్వ ఉంచుతున్నారు. ఇది కొందరి పాలిట శాపంగా మారుతోంది. సరైన అవగాహన లేకపోవడం, భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో వివిధ రూపాల్లో ప్రమాదాలకు దారి తీస్తోంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చు.

- సాధ్యమైనంత వరకు పత్తిని ఇంట్లో నిల్వ చేయకూడదు. ప్రత్యామ్నాయం లేక నిల్వ చేస్తే జాగ్రత్తలు పాటించాలి.
- పత్తి ఉంచిన గదికి విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.
- విద్యుత్ తీగలను ఎలుకలు కొరకడం, తెగడం వంటి కారణాలు షార్ట్ సర్క్యూట్‌కు దారి తీస్తాయి. విద్యుత్ తీగలు తెగితే సక్రమంగా అతికించేలా చర్యలు తీసుకోవాలి.
- బీడీలు, చుట్టలు, సిగరెట్లు తాగి ఆర్పకుండా గది వద్ద పడేయొద్దు. ఇంట్లో దీపం, అగర్‌వత్తులు వెలిగించి వదిలేయొద్దు. ఎలుకలు పత్తిని తీసుకెళ్లి ఎక్కడైనా పారేయడం కూడా అగ్ని ప్రమాదాలకు ఆస్కారం కావొచ్చు.
- చిన్నపిల్లలను పత్తి నిల్వ చేసిన ప్రాంతాల వైపు వెళ్లకుండా చూసుకోవాలి.

బాలికా విద్యతో దేశాభివృద్ధి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



బహుమతి అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్: బాలికా విద్యతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా మహిళా శిశు, వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 'బాలికలను చదివిద్దాం- బాలికలను ఎదగనిద్దాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ చదువు ద్వారా కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల చదువు కోసం వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి రక్షణతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తోందని తెలిపారు. బాలికల రక్షణ కోసం షీటీమ్స్, సఖి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. లింగవివక్ష లేకుండా అన్నిరంగాల్లో వారిని ప్రోత్సహిస్తున్నామని, బాల్య వివాహాల నివారణ కోసం అన్నిశాఖల సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దేశం కోసం పోరాడిన వీరవనితలను ఆదర్శంగా తీసుకుని విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో శకుంతల, సఖి కేంద్రం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజాస్వామ్యంలో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ఓటుహక్కు ఎంతో కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం అదనపు కలెక్టర్లు రాజేశం, చాయత్ బాజ్‌పాయ్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్ నుంచి జన్కాపూర్, కుమురంభీం చౌక్, అంబేద్కర్ చౌక్‌ల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ పౌరుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కులమత, వర్గ, ప్రాంత విభేదాలు లేకుండా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లు శంకర్, తుకారాం, లక్ష్మి, భూదేవి తోపాటు నూతనంగా ఓటు నమోదు చేసుకున్న ని హారిక, దేవేందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి చర్యలు

ఆసిఫాబాద్: జిల్లాలో మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఐకేపీ, బ్యాంకు అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించి, వంద శాతం లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. బ్యాంకు లింకేజీలు, రికవరీలను ఫిబ్రవరి 15లోగా పూర్తిచేయాలన్నారు. స్వయం సహాయ సంఘాల కోసం మండలాల్లో యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో సురేందర్, ట్రాన్స్‌కో ఈడీ వాసుదేవ్, ఐకేపీ డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

అభినవ షిర్డీ క్షేత్రం.. సాయి మందిరం

- నేడు ఘనంగా ఆలయ వార్షికోత్సవం
- తరలిరానున్న భక్తులు



ముస్తాబైన సాయి మందిరం

ఆసిఫాబాద్: ఓం సాయి.. శ్రీసాయి.. జయ జయ సాయి.. జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి మందిరం సాయి నామస్మరణతో మార్మోగుతోంది. రోజురోజుకూ ఆలయంలో భక్తుల తాకిడి పెరగడంతో నిత్య కల్యాణం, పచ్చతోరణంగా విరాజిల్లుతోంది. ఈ మహిమాన్విత క్షేత్రం అభినవ షిర్డీ క్షేత్రంగా వెలుగొందుతోంది. గురువారం ఆలయం 23వ వార్షికోత్సవంతోపాటు వసంత పంచమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్యం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలతోపాటు పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో సాయినాథుడి మూల విరాట్టు, ఈశాన్యంలో విఘ్నేశ్వరుడు, ఆగ్నేయంలో దత్తాత్రేయుడు, నందీశ్వరుడు కొలువై ఉన్నారు. కాగజ్‌నగర్, రెబ్బెన, వాంకిడి, తిర్యాణి, కెరమెరితోపాటు వివిధ ప్రాంతాలతోపాటు సరిహద్దులోని మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చి సాయినాథుడిని దర్శించుకుంటారు.

2000లో విగ్రహ ప్రతిష్ట

ఆలయానికి 1997 నవంబర్ 24న పరమహంస సద్గురు పూలాజీ బాబా చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. 2000 ఫిబ్రవరి 10న పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్య నృసింహ భారతి విగ్రహ ప్రతిష్ట చేశారు. భక్తుల సహకారంతో కల్యాణ మంటపం, ముఖద్వారం, అన్నదాన మంటపం నిర్మించారు. 22 ఏళ్లుగా ఆలయంలో ప్రతిరోజూ రాత్రి సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, లక్ష్మి అష్టోత్తరాలు, రుద్రాష్టకం, శ్రీరామరక్ష స్తోత్రం, శ్రీమద్భగవద్గీత పారాయణం నిరాటంకంగా సాగుతోంది. గురుపౌర్ణమి సందర్భంగా సామూహిక సచ్చరిత్ర పారాయణం, సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తారు.

ఆలయం ముస్తాబు

నేడు 23వ వార్షికోత్సవం జరుపుకునేందుకు ఆలయం ముస్తాబైంది. కొత్తగా రంగులు వేసి మామిడి తోరణాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, పంచగవ్యప్రాశన, నవగ్రహ వాస్తుయోగిని, క్షేత్ర పాలక, సర్వతోభద్ర మండల స్థాపన పూజ, హోమం, మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని అర్చకులు మధుకరశర్మ కోరారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- మత్తు పదార్థాలపై దృష్టి సారించాలి
- డీజీపీ అంజనీకుమార్
- శాంతిభద్రతలపై ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు

ఆసిఫాబాద్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. కేసుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల మోసాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి వేగంగా చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతల గురించి ఎస్పీ సురేశ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పోలీసుల పనితీరుపై డీజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. వీసీలో అదనపు ఎస్పీలు అచ్చేశ్వర్‌రావు, భీమ్‌రావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ నాగేందర్, సీఐలు, ఆర్‌ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గణతంత్ర వేడుకలు



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఏర్పాట్లు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఈ ఏడాది కూడా గణతంత్ర దినోత్సవం సాదాసీదాగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోవిడ్ నేపథ్యంలో రెండేళ్లుగా ఆర్భాటాలు లేకుండా వేడుకలు నిర్వహించారు. కరోనా తగ్గుముఖం పట్టడంతో గురువారం రిపబ్లిక్ డే వేడుకలు పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశంలో ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని, విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఎంపిక చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది అట్టహాసంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు జరుగుతాయని భావించినప్పటికీ బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలోనే ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉదయం 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. ఉదయం 10.15 గంటలకు పోలీసు గౌరవ వందనం స్వీకరణ, 10.20కి ప్రశంసా పత్రాల ప్రదానం, 10.30కి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

భీమన్న స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలన

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల ఏర్పాట్లను బుధవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ పరిశీలించారు. పతకావిష్కరణ ప్రదేశంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. మాదారం, గోలేటి టౌన్‌షిప్‌తోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థుల కోసం పూర్తిస్థాయిలో టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలు విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి, ఈఈ సివిల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



భీమన్న స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం దేవేందర్, అధికారులు

27న అవగాహన శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: ఉద్యోగుల భవిష్యత్తు నిధి సంస్థ కరీంనగర్ ప్రాంతీయ కార్యాలయం ఆ ధ్వర్యంలో పీఎఫ్ మీ ముంగిట (నిధి ఆప్కే నికట్- 2.0) జిల్లా అవగాహన శిబిరాన్ని ఈ నెల 27న కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవనంలో నిర్వహించనున్నట్లు కరీంనగర్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ థానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని జిల్లాల్లో ఈ కా ర్యక్రమాన్ని ఒకే రోజు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు పద్మశాలి భవనంలో అన్ని మండలాలకు చెందిన పీఎఫ్‌కు సంబంధించి అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ బాలు, ఆర్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మాటువేసి ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని హాజీపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

అర్చకుడిపై ఎంసీసీ యాజమాన్యం దాడి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎంసీసీ సిమెంట్ కంపనీకి ఆవరణలో ఉన్న ఆలయ అర్చకుడిపై కంపనీకి చెందిన వ్యక్తులు దాడి చేశారని కాలనీ వాసులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు సతీశ్‌పై దాడిచేయడంతో గాయాల పాలైనట్లు వారు పేర్కొన్నారు. కాగా కంపెనీ ఆవరణలో ఉన్న రామాలయం, శివాలయం విషయంలో కొంతకాలంగా తగాదా ఉందన్నారు. ఆ భూములు కంపనీకి చెందినవని, వాటిపై ఇతరులకు హక్కులేదని ఎంసీసీ కంపెనీ యాజమాన్యం వాదిస్తోందన్నారు. కానీ ఏసీసీ సిమెంటు కంపనీ కొనసాగుతున్న కాలంలో కార్మికుల జీతాల నుంచి చందాలు వేసి ఆలయాలు నిర్మించామన్నారు. ఆలయాలపై హైకోర్టులో వివాదాలు ఉన్నాయని, కోర్టు తీర్పు వచ్చే వరకు ఆలయాలకు భక్తులను అనుమతించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ముగిసిన బేతల్ పూజలు

- సంప్రదాయ పూజలు ముగించిన మెస్రం వంశీయులు
- కొనసాగుతున్న నాగోబా జాతర
- తరలివస్తున్న భక్తజనం
- దర్శనానికి గంటల తరబడి క్యూ
- జనసంద్రంగా నాగోబా ఆలయం



నాగోబాకు మొక్కి సంప్రదాయ పూజలు ముగిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: ఈ నెల 21న మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. బుధవారం బేతల్‌పూజతో మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలను ముగించారు. ముందుగా సంప్రదాయ వాయిద్యాలతో గోవడ్ ముఖద్వారం వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులకు ఆ వంశం మహిళలు కాళ్లు కడిగి బేతల్ పూజకు ఆహ్వానించారు. మెస్రం వంశం మహిళలు, కొత్తకోడళ్లు బేటింగ్ అయ్యారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తున్న ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులకు కానుకలు అందించారు. మెస్రం వంశం పెద్దలు వెదురుకర్ర పట్టుకుని బేతల్ నృత్యాలు చేశారు. బేతల్ పూజలు ముగిసిన అనంతరం నాగోబాకు మొక్కి సంప్రదాయ పూజలు ముగించారు. అనంతరం గోవడ్ సమీపంలో సతిదేవత ఆలయంలో వచ్చిన కానుకాలను, ప్యాలాలను 22కితల వారీగా పంపిణీ చేశారు. రూ.లక్షా 29వేలు కానుకలు వచ్చినట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా మహా పూజలకు తీసుకొచ్చిన కొత్త కుండలను కితల వారీగా మెస్రం వంశీయులకు పంపిణీ చేశారు. వాటికి ఏడాది పాటు పూజలు చేయాలని సూచించారు. సాయంత్రం ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ బుడుందేవ్ ఆలయానికి బయలుదేరారు. ఈ నెల 27న తెల్లవారుజమున బుడుందేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించనున్నట్లు మెస్రం వంశం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశం పెద్దలు మెస్రం బాదిరావ్ పటేల్, మెస్రం కోసు కటోడ, మెస్రం దేవ్‌రావ్, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం సోనేరావ్, మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి ఉన్నారు.

కొనసాగుతున్న నాగోబా జాతర

నాగోబా జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్శనానికి గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. బుధవారం సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో నాగోబా ఆలయం జనసంద్రమైంది. ఈ నెల 28 వరకు జాతర అధికారికంగా కొనసాగుతుండగా అనధికారికంగా ఈ నెల 31 వరకు కొనసాగనుందని దేవదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు.



వెదురుకర్రను శుద్ధిచేస్తున్న మెస్రం మహిళలు



నాగోబా దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



కానుకలు వేస్తున్న మెస్రం వంశ మహిళలు, కొత్త కోడళ్లు



బేతల్‌పూజ ప్రారంభిస్తున్న ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్

రక్షణ సూత్రాలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎంఎస్ ఆనంద్ వేల్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలోని గనులు, డిపార్టుమెంట్లలో విద్యుత్ వినియోగంలో రక్షణ సూత్రాలు తూచా తప్పకుండా పాటించాలని డీఎంఎస్ ఎలక్ట్రికల్ ఎస్.ఆనంద్ వేల్ అన్నారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్ అధికారులు, పర్యవేక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రమాదరహిత సింగరేణిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఏరియా అధికారులు డీఎంఎస్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, డీజీఎం సీహెచ్‌పీ భీంరావ్‌జాడే, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్(సిర్పూర్): పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీకి చెందిన పి. పుష్పలత (30) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన పుష్పలతకు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న కాగజ్‌నగర్‌కు చెందిన రమేశ్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భర్త రమేశ్‌తో పాటు కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేసేవారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి సరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జన్నారం(ఖానాపూర్): మండల కేంద్రంలోని ఓ రేషన్ దుకాణం వద్దకు అక్రమంగా తీసుకువచ్చిన రేషన్ బియ్యాన్ని స్థానికులు పట్టుకున్నారు. గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాలకు చెందిన బియ్యాన్ని బుధవారం సాయంత్రం జీసీసీ గోదాంలో డంప్ చేసేందుకు వ్యాన్‌లో తీసుకురాగా ఆదివాసీ నాయకులు మెస్రం రాజ్‌కుమార్, పెంద్రం రాజేశ్వర్ అడ్డుకుని పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్‌ఐ భానుచందర్ వచ్చి వ్యానులో ఉన్న 20 బస్తాల బియ్యంతో పాటు టూత్‌పేస్ట్, దువ్వెనలు, మూడు ఉప్పు బస్తాలు, ఇతర సామగ్రి సీజ్ చేసి పంచనామా నిర్వహించారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



పట్టుకున్న బియ్యం వాహనం

పోస్టాఫీసుల్లో పెరిగిన వడ్డీరేట్లు

ఆసిఫాబాద్‌అర్బన్/కాగజ్‌నగర్‌టౌన్: దేశ వ్యాప్తంగా తపాలాశాఖలోని అన్ని పోస్టల్ పథకాలకు భారీగా వడ్డీ రేట్లు పెరిగాయని ఆ శాఖ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ సిరికొండ సతీశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జనవరి 1, 2023 నుంచి వడ్డీరేట్లు భారీగా పెంచిందని ఆయన పేర్కొన్నారు. వాటికి సంబంధించిన స్కీం వడ్డీరేట్లను ఆయన వివరించారు. సేవింగ్ ఖాతా 4 శాతం, రికరింగ్ డిపాజిట్ ఖాతా 5.8 శాతం, టైం డిపాజిట్ ఖాత మొదటి సంవత్సరం 6 శాతం, రెండో సంవత్సరం 6.8, మూడో సంవత్సరం 6.9, ఐదో సంవత్సరం 7 శాతంగా నిర్ణయించారు. నెలవారీ ఆదాయం ఖాతాలో 7.1 శాతం, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్‌లో 7శాతం, కిసాన్ వికాస పత్రం 7.2 శాతం, సీనియర్ సిటిజన్ ఖాతాలో 8 శాతంగా పొందుపర్చినట్లు తెలిపారు. సుకన్య సమృద్ధి ఖాతా (బేటీ పడావో బేటీ బచావో)లో 7.6 శాతం, పీపీఎఫ్ ఖాతా 7.1 శాతంగా ఉందన్నారు. పెరిగిన వడ్డీ రేట్లు ప్రజలకు తెలియపర్చేందుకు ఈ నెల 28 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉత్సాహంగా ఎడ్లపందెం పోటీలు

- జిల్లాస్థాయి పోటీలో పాల్గొన్న 16 ఎడ్లబండ్లు
- విజేతగా నిలిచిన మందమర్రి



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ శశికళ

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని గొల్లపల్లిలో బుధవారం జిల్లాస్థాయి ఎడ్లపందెం పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ఇందూరి శశికళ అధ్యక్షతన నిర్వహించిన పోటీల్లో జిల్లా నుంచి 16 జతల ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. మందమర్రి మండలం నుంచి పెద్ది వేణు ఎడ్లబండి ప్రథమస్థానంలో నిలువగా కన్నెపల్లి మండలం టేకులపల్లికి చెందిన సత్తన్నవేణి బీరయ్య ద్వితీయస్థానంలో, జైపూర్ మండలంలోని ఇందారంకు చెందిన నల్లి దీప్‌కుమార్ తృతీయ బహుమతి సాధించారు. ప్రథమ బహుమతికి రూ.8 వేలు, ద్వితీయ బహుమతికి రూ.6 వేలు, తృతీయ బహుమతికి రూ.5 వేల నగదు అందజేశారు. పోటీలను తిలకించేందుకు అధికసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, వైస్ చైర్మన్ కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ శ్యామల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందూరి రమేశ్, నాయకులు చీర్ల మొండన్న, కొండ అంకుల్, నిర్వాహకులు చింత విఘ్నేష్, మెండె రవి, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు సీఐలు బదిలీ

మంచిర్యాలక్రైం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్లో పని చేస్తున్న సీఐ బీ.శ్రీనివాస్‌ను నిర్మల్ రూరల్ సీఐగా, ఆదిలాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కొంక మల్లేశ్‌ను నిర్మల్‌టౌన్‌కు, రామగుండం సీఆర్‌బిలో పనిచేస్తున్న రాజ్‌కుమార్‌గౌడ్‌ను బెల్లంపల్లిరూరల్‌కు, నిర్మల్ రూరల్ సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, నిర్మల్‌టౌన్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎన్‌శ్రీనివాస్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, బెల్లంపల్లి రూరల్‌లో పనిచేస్తున్న బాబురావ్‌ను రామగుండం సీసీఆర్బీకి బదిలీ చేశారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన రాజారమేశ్

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారమేశ్ మంగళవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇటీవల ఆయన ఎల్లందుకు బదిలీ అయిన నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాల అనంతరం రేవంత్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాజకీయ కారణాలతోనే ఇక్కడి నుంచి బదిలీ చేశారనే చర్చ సాగుతున్న నేపథ్యంలో ముందుగా ఎల్లందుకు వెళ్లి జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వనున్నట్లు తెలిసింది. రాజకీయాల్లోకి రావాలని భావిస్తున్న రమేశ్ చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో గద్దెరాగిడిలో ఇల్లు కూడా తీసుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎంపీ పొంగులేటితో రాజారమేశ్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. ఇటీవలే ఢిల్లీకి వెళ్లి వచ్చిన ఆయన పొంగులేటి సలహాతోనే రేవంత్‌ను కలిశారని చెబుతున్నారు. ఏ పార్టీలో చేరే విషయమై కొద్ది కాలంపాటు వేచిచూస్తేనే బాగుంటుందన్న పొంగులేటి సలహాను పాటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రమేశ్

'కార్మిక సమస్యలు గాలికొదిలిన టీబీజీకేఎస్'



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

తాండూర్(బెల్లంపల్లి): గుర్తింపు కార్మికసంఘం టీబీజీకేఎస్ సింగరేణి యాజమాన్యానికి తొత్తుగా మారి కార్మిక సమస్యలు గాలికి వదిలేసిందని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి విమర్శించారు. బుధవారం గోలేటి వర్క్‌షాపులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడటంలో గుర్తింపు సంఘం విఫలమైందన్నారు. వర్క్‌షాపు పనిస్థలాల్లో అధికారులు సీసీ కెమెరాలు పెట్టి కార్మికులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. కార్మికులను ఇబ్బంది పెట్టే విధానాలు మానకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ అశోక్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ నాగరాజు, నాయకులు చంద్రయ్య, వేణు, తదితరులు పాల్గొన్నారు.

30న వాహనాలకు వేలం

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని ఆయ పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్క్రాప్ కింద వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి సీపీ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 192 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు ఉన్నాయని, ఆర్నెళ్లుగా ఎవరూ స్పందించకపోవడంతో గుర్తు తెలియని వాహనాలుగా పరిగణించి ఈ నెల 30న ఉదయం 10 గంటలకు బెల్లంపల్లిలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మధూకర్ 8712656616, అంజన్న 9494026036 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

29న మహాసభ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

బెల్లంపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించనున్న కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ (ఇఫ్టూ) జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం బెల్లంపల్లిలోని సింగరేణి సివిక్ కార్యాలయంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జాతీయ కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ హక్కులు, క్రమబద్ధీకరణ, కనీస వేతనం కోసం ఐఎఫ్‌టీయూ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్ర మహాసభలో సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ శ్రేణులు శ్యామ్, రవి, అబ్దుల్లా, వెంకటేశ్, లచ్చన్న, శ్రీనాథ్, రాములు, సదానందం, ఓదమ్మ, తదితరులు పాల్గొన్నారు.